# నా కొడుకు దొంగ కాదు

చిటిపోలు వేంకటరత్నం



"ఎవరండీ లోపల ?"

ఉలిక్కిపడ్డాడు ఎంకటేసు. మెల్లగా లేచి వెళ్లి తలుపు తీశాడు.

"ఎవురు గావాల బాబూ ?"

"వేంకటేశ్వర్లంటే మీరే కదూ ?" అడిగాడు తెల్లపాంటు, నల్ల చొక్కా వేసుకున్న అబ్బాయి. ఆ అబ్బాయితోపాటు ఇంకో కుర్రాడు కూడ లోపలికి వచ్చాడు. చారల పాంటు, పూల చొక్కా తొడుక్కున్నాడు.

"నేనే బాబూ" సాలోచనగా అన్నాడు ఎంకటేసు.

అతడి ఆర్థిక స్థితి తెలుసుకోవడానికి 'ఎంకటేసు' అన్న పేరులోని నిరాడంబరత్వమే చాలేమో ! గోడలు వెలిసిపోయిన పూరిల్లు, కొద్దిగా నగదు, రోజువారీ కూలీ తప్ప ఎంకటేసుకు వెనకా ముందూ ఏమీ లేదు.

"ఇంతకీ మీ రెవురు బాబూ ?" అడిగాడు ఎంకటేసు.

"నన్ను 'వాసు' అంటారు. వీడి పేరు 'రాజు'. ఈ ఊళ్లోనే హాస్టల్‌లో ఉంటూ కాలేజీలో చదువుకుంటున్నాం" చెప్పాడు వాసు ఎంకటేసు చూపించిన బల్లమీద కూర్చుంటూ.

మంచానికి ఒక చివర సుస్మితంగా కూర్చున్నాడు 'రాజు' అనబడే కుర్రాడు.

"చూడండీ, మీరు బాధపడతారేమో..."

"అట్టాంటిదేం లేదులే సెప్పు బాబూ."

ఒక్క క్షణం ఎంకటేసు కేసి పరిశీలనగా చూశాడు వాసు. లోతుకు పోయిన కళ్ళు... వీపు కంటుకుపోయిన పొట్ట... శుష్కించిన శరీరం... ఎంత దయనీయంగా ఉన్నాడో ఎంకటేసు !

మనసులోనే ఒక్క నిట్టూర్పు విడిచాడు.

"కోటి లింగమంటే మీ అబ్బాయే కదూ !"

"ఔన్నాయనా. ఆడ్నాకొక్కగానొక్క నలుసు. ఏం జేసిండాడు ?"

చెప్పాడు వాసు.

ఎంకటేసు హడలిపోయాడు.

తన కొడుకు దొంగా ! ?... వాడికి తనేం లోటు చేశాడని !... లేదు. అలా జరగడానికి వీల్లేదు. ఇదెవరో గిట్టనివాళ్ళు అల్లిన అబద్ధమై ఉంటుంది. అంతే.

అదే వెళ్లబోసుకున్నాడు వాసుతో.

"అలా అంటే ఎలా అండీ ? కళ్లముందు ప్రత్యక్షంగా కనబడుతుంటే."

"ఏదైనా సరే. ఇది నిజం గాదు. పచ్చి అబద్దం" కొంచెం గట్టిగానే అన్నాడు.

రాజు తొందర పెట్టాడు.

"మాటల కిది సమయం కాదండీ. వెంటనే మీరక్కడికి రాకపోతే అతగాణ్ణి చావబాదేట్టున్నారు మావాళ్ళు."

ఇక చేసేది లేక హడావిడిగా బయలుదేరాడు ఎంకటేసు. మేకుకు వ్రేలాడుతున్న ముతక చొక్కాను ఒంటికి తగిలించుకొని ఉన్నవాడున్నట్లే ప్రయాణమయ్యాడు.

"నా కొడుకు కట్టాంటోడు కాదు నాయనో"

అని బావురుమంది అప్పటిదాకా గోడవారగా నిల్చుని విస్మయంతో చూస్తున్న మాణిక్యమ్మ — ఎంకటేసు పెళ్లాం.

భార్యకు ధైర్యం చెప్పి కుర్రాళ్లిద్దరితో బయలుదేరాడు ఎంకటేసు.

దారిపొడుగునా ఎంకటేసు గుండెల్లో అగ్ని పర్వతాలు బ్రద్దలౌతూనే ఉన్నాయి.

ఎలాగైతేనేం గమ్యాన్ని చేరుకున్నారు.

వాతావరణం అంతా గందరగోళంగా ఉంది. ఎంకటేసును చూడడంతోటే అందరూ తప్పుకున్నారు.

ఎంకటేసు కొడుకును సమీపించాడు. కొడుకును ఆ స్థితిలో చూస్తుంటే కళ్లలో నీళ్ళు తిరిగాయి ఎంకటేసుకు... వరండాలో స్తంభానికి కట్టివేయబడి ఉన్నాడు తన కోటిగాడు !

"ఏరా కోటే ! నీకీ పాడుబుద్ధెందుకు పుట్టిందిరా. నీకేం తక్కువైందని ఈ తలొంపుల పనికి పూనుకుంటివి ?"

కోటిగాడు మాటాడలేదు. ముఖం త్రిప్పేసుకున్నాడు.

మెల్లిగా గడ్డం పైకెత్తి లాలనగా అడిగాడు. "ఎందుకు జేసినవీ పని సెప్పు. ఎవురైనా సెప్పిన్రా లేక నీకు నువ్వే సేసినవా."

సమాధానం లేదు.

గుంపులో నుంచి ఎవరో కర్తవ్యం గుర్తు చేశారు.

"అసలా గడియారమేం చేశాడో చెప్పమనండి. ఆ తర్వాత సంగతి ఆలోచిద్దాం."

అర్థింపుగా అడిగాడు ఎంకటేసు. "పోనీ, అదైనా సెప్పరా."

"... ... ..."

ఎంకటేసు పరి పరి విధాల బ్రతిమాలాడు కొడుకును. కోటిగాడు నోరు మెదపలేదు.

"ఇలా బ్రతిమాలితే లాభంలేదండి. గదిలో కెత్తుకెళ్లి ఆ చెంపా యీ చెంపా వాయిస్తేగాని నిజం కక్కడు." అరచారెవరో ఉడుకుపిండం.

ఇంకేముంది ! కోటిగాణ్ణి ఎత్తుకొని అమాంతం గదిలోకి పట్టుకెళ్లారు. రాజు, వాసు, ఎంకటేసు వారించినా వినలేదు. ఎంకటేసును బయటే వుండమన్నారు.

ఎలాగో కష్టపడి కోటిగాడి నోట నిజం కక్కించారు.

"పొద్దున్న పేకాటలో ఓడిపోయిన్నా. మాపటేలకి పైసలట్టుకు రాకుంటే మక్కెలిరగ దంతానన్నాడాడు. గడియారం బాకీ కింద ఆడి కిచ్చేసినా. ఆ డిప్పు డేడున్నాడో తెలవదు." చెప్పాడు కోటిగాడు.

రాజు యీ విషయం ఎంకటేసుకు చెప్పాడు.

ఎంకటేసు హతాశుడయ్యాడు.

ఏమిటీ ! తన కొడుకు కిలాంటివాడా ! తన కింతవరకు తెలీదే ! ఒక్కగానొక్క నలుసని కంటికి రెప్పలా చూసుకున్నారు భార్యాభర్తలిద్దరూ. ఆ గారాబమే వాణ్ణి ఈ రోజు కిలా తయారు చేసిందేమో !

కోటిగాణ్ణి వాసు చీవాట్లు పెట్టాడు.

కోటిగాడు దేనికీ ఉలకలేదు, పలకలేదు.

ఇప్పుడిప్పుడే వాడి మనసులో పశ్చాత్తాపం రగులుకుంటున్నట్లుంది.

అసలు తనెందుకిలా చేశాడు ? ప్రపంచంలో తనంత దౌర్భాగ్యు లుంటారా ? తండ్రి తనకు పంచియిచ్చిన ప్రేమానురాగాలకి తను ప్రతిఫలంగా చేసిందేవిటి ? నలుగురిలో ఆయన పరువు మంట గలపడం. తన్ను కన్నందుకా తల్లిదండ్రు లెంతగా ఆక్రోశిస్తున్నారో.

కోటిగాడి బుర్రలో గతం అంతా గిర్రున తిరిగింది.

కోటిగాడికి మొదటినుంచీ కోరిక లెక్కువ. తను పెద్ద ఆఫీసరై పోవాలని, పెద్ద పెద్ద వాళ్లందరూ తన కటాక్షంకోసం పడిగాపులు కాయాలని, కలవాళ్లమ్మాయిని చేసుకుని గర్వంగా బ్రతకాలని ... యెన్నో కలలుకనేవాడు. కాని తండ్రి ఆర్థిక పరిస్థితులు అందుకు 'ససేమిరా' అన్నాయి. అయిదో తరగతితోనే చదువుకు 'బ్రేక్' పడింది.

చదువైతే ఆగిందికాని కోటిగాడి అంతరాంతరాలలోని 'ఆశ' యింకా నిద్రపోలేదు. పట్నంలో బరబరలాడే కార్లూ, ఘరానా మనుషులు వాడి మనసును తొలిచేస్తూనేవున్నారు. వాళ్లను చూచినప్పుడల్లా, వాళ్లలా చదువుకోకపోయినా డబ్బైనా సంపాదించాలనిపించేది పన్నెండేళ్ల కోటిగాడికి. వ్యాపారం చేయడానికా — తన కంత తాహతులేదు. మరేం చెయ్యాలి ? వాడి లేత మనసులో పేకాట మిగిలింది. అంతే ... దానికి దాసుడయ్యాడు.

ఇక వాడేం చేస్తున్నాడో, ఎలా తిరుగుతున్నాడో తెలుసుకుని దిద్దుకునే శ్రద్ధ, తీరిక తండ్రికి లేవు. తల్లికా — వాడంటే వల్లమాలిన ప్రేమ. ఇలా కొంత ప్రేమ, కొంత అశ్రద్ధ కలిసి వాడి జీవితాన్ని ఈ మలుపు త్రిప్పాయి. చెడిపోయాడు.

ఎవరో తనను భుజం తట్టి మందలించడంతో ఈ లోకంలోకి వచ్చాడు కోటి

గడియారం పోగొట్టుకున్న కుర్రాడు కాబోలు తండ్రిని అడుగుతున్నాడు. "కొత్తది కొనాలంటే నూటయాభై అవుతుందండీ. చాల కాలం వాడుకున్నాను కాబట్టి నూటపాతిక ఇవ్వడం న్యాయమనుకుంటాను."

ఎంకటేసు కొడుకు వైపు చూశాడు. సిగ్గుతో తల దించుకున్నాడు కోటి

చర్చించుకోవడాలన్నీ అయిన తరువాత నూటపాతిక ఇవ్వడమే సబబు అన్నారందరూ. ఎంకటేసుకూ అలాగే అనిపించింది.

ోటిని తీసుకొని ఇంటి ముఖం పట్టాడు.

యెంటెవురైనా రండి బాబూ. పైస లంపుల."

ఎంకటేసును అనుసరించాడు.

ఎంకటేసు మాటైతే అన్నాడుగాని గుండెల్లో రైళ్ళు రుగెత్తుతూనే ఉన్నాయి.

కప్పించడానికి పైస లవసరమై మాణిక్యమ్మ మెళ్లో తాళి తాకట్టు పెట్టి వంద రూపాయ తెచ్చాడు తను. ఆ కాస్త డబ్బూ వీడు చేసిన వెధవ పనికి తగలబెట్టవలసివస్తుంది. పైగా తల తీసేసినంత అవమానం.

కుమిలిపోయాడు ఎంకటేసు.

ఏం చేస్తాడు ! మచ్చుమీద పెట్టెలో ఉన్న వంద రూపాయలకు మరో పాతిక కలిపి వాసు చేతిలో పెట్టాడు.

"పేదోల్ల బతుకులకి తగ్గట్టే ఉంటాయి బాబూ ఆల్ల బుద్దులు కూడ."

వాసుకు మనసు బరువెక్కింది. పైకం లెక్కపెట్టుకొని, తల వంచుకు వెళ్లిపోయాడు.

కోటిగాడు వాసు వెళ్లినవైపే గ్రుడ్లప్పగించి చూస్తుండిపోయాడు. తండ్రి అన్న మాటలు వాడి హృదయం మీద ఆంపవు పళ్లలా పనిచేశాయి.

. తను తొమ్మిది గంటలకే హాస్టలుకు వెళ్లడం... "మా యాజమానిగా రబ్బాయి కోసం వచ్చా"నని అబద్ధం చెప్పడం... ఎవరూ చూడకుండా గూట్లోని గడియారాన్ని జేబులో వేసుకోవడం... ఒకదాని తరువాత ఒకటి పుస్తకంలో పుటల్లా తిరిగిపోయాయి కోటిగాడి మెదడులో. వెదుక్కుంటూ వెళ్లి, గడియారం బాకీ కుర్రాడికప్పజెప్పి వచ్చాడు. గడియారంతోపాటు తనూ పోతే తనమీద అనుమానం రావచ్చుననే ఉద్దేశంతో మళ్లీ అక్కడికే వెళ్లాడు. నిజంగానే ఆ రూమ్‌లోవాళ్ళు తనను అనుమానించారు. తనను అడిగిన ప్రశ్నలకు అస్తవ్యస్తంగా సమాధానాలు చెప్పి దొరికిపోయాడు.

అలా పట్టుబడడం కూడ తన మంచికేనేమో ! అనుకున్నాడు కోటి.

ఈ సంఘటనే జరగకపోతే తను ఇంకా ఎలా మారి ఉండేవాడో !

కోటిగాడు మనసు ఉండబట్టలేకపొయ్యాడు.

"ఇట్టాంటి తప్పుడు పని జల్మలో ఎప్పుడూ సెయ్యనయ్యా" అనేశాడు దిగాలుగా మంచంమీద కూలబడ్డ తండ్రి కళ్ళల్లోకి చూడలేక చూడలేక చూస్తూ.

ఎంకటేసు కొడుకును కౌగిలించుకొని ప్రేమగా తల నిమిరాడు.

"కోటీ! ఎట్టాంటి పన్జేసినవురా" అని బొబ్బలుపెడుతూ లోపలినుంచి వచ్చింది మాణిక్యమ్మ.

ఎంకటేసు ఆపడానికి యత్నించాడు.

మాణిక్యమ్మకు ఉక్రోషం ఆగలేదు.

"ఏం జల్మరా నీది. పాడు జల్మ. ఇట్టా బుద్ధితక్కువ పన్జేసేబదులు అల్ల బాయిలో పడి సావకపోతివేరా. మా కింత అప్రెదిష్ట లేకపోను...'

కోటిగాడు తల్లిని కౌగిలించుకుని భోరమన్నాడు.

మాణిక్యమ్మకు హఠాత్తుగా ఒగిరింపు ఎక్కువైంది. నిటారుగా నిలబడలేకపోయింది.

"ముదనష్టపు గుండె నెప్పి మల్లా వొచ్చిందా మాణిక్యం" అంటూ ఎంకటేసు మాణిక్యమ్మను తీసుకువెళ్లి మంచంమీద పడుకోబెట్టాడు మెల్లిగా. కోటిగాడు కూడ సాయం చేశాడు.

మాణిక్యమ్మకు ఉద్రేకం ఎక్కువైనప్పుడల్లా ఇలా నొప్పి రావడం మామూలే. ఇప్పుడు కొడుకు ప్రవర్తనకి మరీ ఎక్కువైంది.

"కోటీ! ఇంక నేను బతకన్రా. బుద్ధిగా మసులుకుంటూ అయ్యను సూస్తుండు."

అంతవరకూ కోటిగాడిమీద ఉన్న క్రోధం ఎటు పోయిందో మరి !

మాణిక్యమ్మ మాటలు విని ఎంకటేసుకు గుండె ఝల్లుమంది.

"అయ్యేం మాటలే మానిక్కెం. ఇప్పుడేం వొచ్చిందని" అన్నాడు ఎలాగో

మాణిక్యమ్మ రెండు చేతులూ ఎత్తి ఎంకటేసుకు దండం పెట్టింది.

"ఎల్లిపోతున్నా మావా" అంది.

భర్తను, కొడుకును చెరొక చేత్తో గట్టిగా పట్టుకుని పైకి లేవబోయింది. కాని శక్తి చాలక అలాగే వెనక్కు వాలిపోయింది. అంతే !... ఆమె ప్రాణాలు అనంతవాయువుల్లో లీనమయ్యాయి.

తండ్రి కొడుకు లిద్దరూ ఒక్కసారిగా గొల్లుమన్నారు.

ఎంకటేసు వెక్కి వెక్కి ఏడుస్తూనే కొడుకు వైపు చూశాడు. "నువ్వగ్గేనంలోంచి కళ్ళు తెరిసే వొరుకు మీ అమ్మ తన కళ్ళు మూసేస్కుందిరా."

కోటిగాడు స్థాణు వయ్యాడు.

